# తిరుపతి - చిత్తూరు




## బిజెపి జాతీయ కౌన్సిల్ సభ్యురాలిగా నిషిధరాజు



పుత్తూరు, జూలై 2 ప్రభాతవార్త :
భారతీయ జనతా పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యురాలిగా పుత్తూరు పట్టణానికి చెందిన హిమజ విద్యా సంస్థల కరస్పాండెంట్ ఎం.నిషిధరాజు నియమితులయ్యారు. కేంద్రంలోని పార్టీ అధిష్టానం ఈ మేరకు ఆమెను నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆమె బిజెపి మహిళా మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యురాలిగా పనిచేస్తున్నారు. కేరళ రాష్ట్ర ఇన్‌ఛార్జ్‌గా కొనసాగుతూ ఇటీవల ఢిల్లీ, కాశ్మీర్ ఎన్నికల్లో ఆమె పార్టీ తరపున ఆయా రాష్ట్రాల్లో ప్రచార కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. 2019 ఎన్నికల్లో నగరి నియోజకవర్గం నుంచి బిజెపి ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆమె పోటీ చేశారు. తనకు జాతీయ కౌన్సిల్ సభ్యురాలి పదవి ఇచ్చినందుకు పార్టీ జాతీయ అధ్యక్షుడు నడ్డా, జాతీయ మహిళా మోర్చా అధ్యక్షురాలు వానతి శ్రీనివాసన్, రాజమండ్రి ఎంపి పురంధేశ్వరికి ఒక ప్రకటనలో కృతజ్ఞతలు చెపుతూ ఆంధ్ర రాష్ట్రంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

## గ్యాస్ లారీ బోల్తా - తప్పిన పెను ప్రమాదం



ఓజిలి, జూలై 2, ప్రభాతవార్త
ఓజిలి పెద్దపరియ 16వ జాతీయ రహదారి హైవే సమీపంలో బుధవారం తెల్లవారు జామున గ్యాస్ రోడ్డుతో వెళ్తున్న లారీ బోల్తా పడింది. ఈ సంఘటనలో ఎలాంటి ప్రమాదమూ జరగకపోవడంతో ఆ ప్రాంత ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గుజరాత్ నుంచి చెన్నైకి ఫుల్ గ్యాస్ రోడ్డుతో లారీ బయలుదేరింది. ఓజిలి పెద్ద పరియ హైవే వద్దకు రాగానే డ్రైవర్ నిద్ర మత్తులోకి జారుకొని లారీ బోల్తా పడింది. లారీ బోల్తా పడిన ఘటనలో ఎవరికీ ప్రమాదం జరగలేదు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఫుల్ లోడుతో ఉన్న లారీ పేలినా బీభత్సం జరిగేది. దీపావళి బాంబుల్లా లారీ పేలిపోయేది. రోడ్డుపై నానా బీభత్సం జరిగేది. వాహనాల రాకపోకల్లో పలువాహనాలు ధ్వంసం అయ్యేవి. ఈ బీభత్సం తలచుకుంటేనే గుండెలు గుభేలుమంటున్నాయి. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని అప్రమత్తం చేస్తున్నారు.

## గరుడ వాహనంపై శ్రీమహావిష్ణువు

### ముగిసిన సాక్షాత్కార వైభవోత్సవాలు



చంద్రగిరి, జూలై 2 ప్రభాతవార్త:
భక్తజనుల గోవింద నామస్మరణల నడుమ శ్రీ మహావిష్ణువు తన నిత్య వాహనమైన గరుడ వాహన సేవ బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి వారి సాక్షాత్కార వైభవోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్వామివారిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి తోమాల సేవ, నిత్యకైంకర్యాలను ఆగమోక్తంగా నిర్వహించారు. ఉదయం 10 గంటల నుండి 11 గంటల వరకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడు ఉత్సవమూర్తులకు పాలు, తేనె, కొబ్బరినీళ్ళు, పసుపు, గంధంతో స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం 5 గంటల నుండి 6 గంటల వరకు ఆలయ ఆవరణలో స్వామి వారు శ్రీదేవి భూదేవి సమేతుడై ఊజంల్‌పై సేదదీరారు. రాత్రి 7 గంటలకు స్వామివారి ఉత్సవమూర్తిని మండపానికి తీసుకువచ్చి వివిధరకాల సుగంధభరిత పుష్పాలు బంగారు ఆభరణాలతో విశేష అలంకరణ గావించి గరుడ వాహనంపై అధిష్టింపజేశారు. శ్రీ హరి నిత్యవాహనమైన గరుడుడిని వేదస్వరూపుడిగా, రెక్కలను వేదం నిత్యత్వానికి, అపౌరుషయత్వానికి ప్రతీకలుగా నిలుస్తున్నాయి. గరుడుని సేవాదృక్పథం, మాతృభక్తి, ప్రభుభక్తి, సత్యనిష్ట, నిష్కళంకత, ఉపకారగుణం సమాజానికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయి. అట్టి గరుడుడిని వాహనంగా చేసుకుని శ్రీమహావిష్ణువు అలంకరణల స్వామి వారు తిరుమాడవీధులలో విహరిస్తుండగా దర్శించుకోవడం ద్వారా సకల పాపహరణ, మోక్షప్రాప్తి లభిస్తుందని శాస్త్రాలు వివరిస్తున్నాయి. ఈ వాహనసేవలో ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ ఎం.గోపినాథ్, విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ పురుషోత్తం, సూపరింటెండెంట్స్ రమేష్‌బాబు, రాజ్‌కుమార్, ఆలయ ప్రధాన అర్చకులు బాలాజీ రంగాచార్యులు, టెంపుల్ ఇన్స్‌స్పెక్టర్ మునికుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## కుప్పాన్ని కరువు రహితం చేస్తా

- సిఎం చంద్రబాబునాయుడు
- ప్రజల జీవితాల్లో వెలుగులు తెస్తా.. ఈ ఏడాదే హంద్రీ-నీవా జలాలు !!
- పెద్ద ఎత్తున పరిశ్రమలు వస్తున్నాయ్ .. యువతకు ఉపాధి అవకాశాలు !!
- కుప్పం అంతటా గ్రీన్ ఎనర్జీ.. పదిలక్షల లీటర్ల పాల ఉత్పత్తికి చర్యలు !!




ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల చెక్కును అందజేస్తున్న సిఎం చంద్రబాబు నాయుడు

శాంతిపురం, జూలై 2 ప్రభాతవార్త
కుప్పం నియోజకవర్గాన్ని కరువు రహితం చేస్తానని, కుప్పం అభివృద్ధి చెందాలన్నదే తన ఆకాంక్ష అని సిఎం చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. రెండు రోజుల కుప్పం పర్యటనలో భాగంగా మండలంలోని తులసినాయనపలి వద్ద జరిగిన ప్రజావేదిక బహిరంగ సభలో సిఎం చంద్రబాబు పాల్గొని ప్రసంగించారు. స్వాతంత్ర్యం వచ్చాక ఒకేసారి ఎవరూ ఇవ్వలేని రీతిలో 3890కోట్లు ఖర్చు చేసి శ్రీశైలం నుంచి550కి.మీ.ల దూరంలో ఉన్న కుప్పానికి హంద్రీ-నీవా కాలువల ద్వారా కృష్ణాజలాలు తీసుకువస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఏడాదే హంద్రీ-నీవా జలాలు వస్తాయని పేర్కొన్నారు. ఏడాది కాలంలో కుప్పం నియోజకవర్గంలో 1293కోట్లతో పనులు ప్రారంభించామని 125 కోట్ల పనులు పూర్తయ్యాయన్నారు. మరో 1168కోట్ల పనులు ఏడాదిలోగా పూర్తి చేసే బాధ్యత తనదేనని సిఎం పేర్కొన్నారు.

**కుప్పానికి పెద్ద ఎత్తున పరిశ్రమలు**

కుప్పానికి పెద్ద ఎత్తున పరిశ్రమలు వస్తున్నాయని తద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని సిఎం చంద్రబాబు పేర్కొన్నారు. 200కోట్లతో ఇ-రాయిస్ సంస్థ, 525కోట్లతో గ్రీన్‌ఫీల్డ్ డెయిరీ, ఎస్వీపి సోయా సంస్థ 372 కోట్లు, మదర్ డెయిరీ 260కోట్లు, శ్రీజ డెయిరీ 233 కోట్లు, అలీప్ సంస్థ 26కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకువచ్చాయన్నారు. వీటి ద్వారా సుమారు 14వేల ఉద్యోగాలు లభించే అవకాశాలు ఉన్నాయన్నారు. అలాగే హిండాల్కో సంస్థ మల్టీస్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుచేస్తోందన్నారు. ఇప్పటికే కుప్పంలో 1665మందికి ఉద్యోగాలు కల్పించినట్లు తెలిపారు. కుప్పంలో 1800 ఎకరాల్లో ఎయిర్‌పోర్టు నిర్మాణంకు 853కోట్లు వ్యయం చేస్తున్నట్లు తెలిపారు. 2500కోట్లు గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుకు ఖర్చు చేయనున్నట్లు పేర్కొన్నారు.

**కుప్పం రూపురేఖలు మార్చుతా**

కుప్పం రూపురేఖలు మార్చుతానని సిఎం చంద్రబాబు పేర్కొన్నారు. కుప్పం పట్టణంలో రోడ్ల విస్తరణ, పట్టణ సుందరీకరణతో పాటు 22కోట్లతో స్టేడియం అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. కుప్పం ప్రాంతంలో పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేస్తామన్నారు. కుప్పం నియోజకవర్గంలోని ఆలయాలకు ఇదివరకే 50కోట్లు మంజూరు చేశామని అన్ని ఆలయాలను పునర్నిర్మిస్తామని ప్రకటించారు. కుప్పంలో రూఫ్ టాప్ సోలార్ ద్వారా గ్రీన్ ఎనర్జీ ప్రాంతంగా మార్చుతామన్నారు. ఇందుకు గాను 564 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. సోలార్ కనెక్షన్లకు బిసిలకు 90వేల రాయితీ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. త్వరలోనే కుప్పానికి ఎలక్ట్రిక్ బస్సులు, ఆటోలు వస్తాయన్నారు.కుప్పం పేరిట ఉత్పత్తుల బ్రాండ్‌లు రావడం హర్షణీయమన్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు తమ సహకారం ఉంటుందన్నారు. కుప్పంలో పది లక్షల లీటర్ల పాల ఉత్పత్తికి చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. కుప్పం ప్రజల ఆరోగ్యం కోసం టాటా డిజిటల్ నెర్వ్ సెంటర్ తీసుకువచ్చామన్నారు. 425 అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు బ్రెయిన్ డెవలప్‌మెంట్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

**గ్రామగ్రామానికి రోడ్లు.. డ్రైనేజీలు :**

కుప్పం నియోజకవర్గంలో గ్రామ గ్రామానికి సిసి, బిటి రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి చర్యలు చేపట్టినట్లు సిఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఇప్పటికే 228కి.మీ.ల బిటి రోడ్లకు 80కోట్లు, సిసి రోడ్లకు 41కోట్లు కేటాయించామన్నారు. అలాగే 1.53కోట్లతో రోడ్లతో గుంతలు పూడ్చామన్నారు. ఏడు సబ్‌స్టేషన్ల నిర్మాణాలకు 18కోట్లు, స్కూళ్ల మరమ్మత్తులకు 10కోట్లు, హాస్టళ్లకు 6.87కోట్లు, పంచాయతీ భవనాలకు 2.60కోట్లు, ట్యాంకుల నిర్మాణాలకు 3.95కోట్లు, ఎన్టీఆర్ సుజలకు 8.22కోట్లు మంజూరు చేశామన్నారు. అలాగే 20కోట్లతో 12వేల మరుగుదొడ్ల నిర్మాణంకు చర్యలు చేపట్టామన్నారు. వేసవిలో నీటి ఎద్దడి నివారణకు 9కోట్లు, టాటా డిజిటల్ నెర్వ్ సెంటర్‌కు 5 కోట్లు, 5639 వీధిదీపాలకు 3.70కోట్లు వ్యయం చేశామన్నారు. కార్యక్రమాల్లో ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, చిత్తూరు ఎంపి దగ్గుమళ్ల ప్రసాదరావు, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్, జాయింట్ కలెక్టర్ విద్యాధరి, టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, రాష్ట్ర విద్య, మౌలిక వసతుల కార్పోరేషన్ ఛైర్మన్ రాజశేఖర్, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి డా॥ బిఆర్ సురేష్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, మండల పార్టీ అధ్యక్షులు విశ్వనాథనాయుడు, రాజ్‌కుమార్, ప్రేమ్‌కుమార్, ఆనందరెడ్డి, రాష్ట్ర నేత గోపీనాథ్, నేతలు జనార్ధనరెడ్డి, ఉదయ్, గోపాల్, మణి, బాలు, రమేష్ పాల్గొన్నారు.

## వధువుగా ద్రౌపది దేవి దర్శనం



శ్రీకాళహస్తి, జూలై 2 ప్రభాతవార్త
వధువుగా ద్రౌపదీ దేవి బుధవారం సప్పరంలో దర్శన మిచ్చారు. మంగళవారం రాత్రి ఆలయం వద్ద సంప్రదాయ బద్ధంగా శాస్త్రోక్తంగా కళ్యాణోత్సవం నిర్వహించారు. ఉదయం ఆలయం నుంచి సప్పరంలో ప్రతిష్ఠించారు.అక్కడ నుంచి అంగరంగ వైభవంగా పట్టణంలో గ్రామోత్సవానికి బయలు దేరారు. మేళ తాళాలు,తప్పెట్ల మోతతో ముందు పోతురాజు పైలట్‌గా వెళుతుండగా అమ్మవార్లు వధువుగా దర్శనమిచ్చారు.ఊరేగింపు పాత వరదయ్యపాళెం రోడ్డు,జయరామారావు వీధి, బజారు వీధి, తేరువీధి, నెహ్రూవీధి, నగరి వీధుల మీదుగా గ్రామోత్సవం సాగింది. ఉత్సవాన్ని చిన్న ఆలయాల ఇన్‌చార్జి లక్ష్మయ్య పూజలు జరిపి ప్రారంభించగా ఉత్సవంతో పాటు ఆలయానికి చెందిన దుర్గా ప్రసాద్ పర్యవేక్షణలో జరిగింది. అమ్మవారికి ఇంటింటి వద్ద హారతులిచ్చారు. అర్చకులు పురుషోత్తం,తులసి వచ్చారు.

## ధరలు లేక...దుఃఖం ఆపుకోలేక...!

### ఆశలు...నేలమట్టం! -ఒకటిన్నర ఎకరాల్లో చెట్లు నరికివేత



ధరల్లేక మామిడి చెట్లును నరికి నేలమట్టం చేసిన రమేష్‌బాబు

తవణంపల్లె, జూలై 2 ప్రభాతవార్త:
ఏడాదిగా ఆహర్నిశలు శ్రమించాడు...కన్న బిడ్డల కన్నా మిన్నగా రాత్రంబవళ్ళు అన్న తేడా లేకుండా చెట్లను..అందులోని పంటను కంటికి రెప్పలా కాపాడాడు. పంట బాఘా వచ్చింది. ఇక నాకష్టాలు ఇట్టే తీరిపోతాయి అనుకున్న ఆరైతు ఆశలు ఆడియాశయ్యాయి. పాలకుల నిర్లక్ష్యం, అధికారులు నిస్సహాయస్థితి నడుమ గతంలో ఎన్నడూ లేనంతగా కనీసం పెట్టిన పెట్టుబడి కూడా తిరిగి రానంతగా తోతాపురి మామిడి కాయల ధరలు పతనం కావడంతో ఆరైతు ఆశలు నేలట్టం అయ్యాయి. అది ఆవేశమో.. ఆక్రోశమో.. లేక అచేతన నిస్సహాయ స్థితిలో చేశాడో తెలియదు కాని నలభై ఏళ్ళ పాటు కరువు నేలలో ఎన్నో కష్ట నష్టాలకోర్చి కంటికి రెప్పలా కాపాడుకున్న మామిడి చెట్లును అమాతంగా మొదళ్ళ వరకు నరికేసి నేలమట్టం చేసేశాడు. ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి పండించిన పంటకు గిట్టుబాటు ధరలు ఇవ్వలేని ప్రభుత్వం నిస్సహాయత మీద ఆరైతు చేసినని మౌన పోరాటమో లే కడుపు ఆరాటమో తెలియదు కాని జిల్లాలో మామిడిరైతులకు వచ్చిన దయనీయ స్థితిమాత్రం ఎవ్వరికి రాకూడదని పలువురు రైతులు అంటున్నారు. మండలంలో సుమారు 9,705 ఎకరాల్లో మామిడి పంటను ప్రధాన పంటగా సాగు చేస్తున్నారు. గత ఏడాది 20 వేల టన్నుల మామిడి దిగుబడి రాగా ఈఏడాది వాతావరణ పరిస్థితులు అనుకూలంగా వుండడంతో సుమారు 56 వేల టన్నుల వరకు తోతాపురి మామిడి దిగుబడి వచ్చినట్లు అధికారుల అంచనా. అయితే గతంలో ఎన్నడూ లేని విధంగా తోతాపురి మామిడికాయల ధరలు అతఃపాతానికి పడిపోయాయి. రైతు పండించిన మామిడికాయలకు రెండు నుండి రెండున్నర రూపాయలు మాత్రమే ధర పలుకుతుండడంతో పంట సాగు కోసం అప్పులు చేసి పెట్టిన పెట్టుబడులు సైతం చేతికందే పరిస్థితులు కనుచూపు మేరలో కనిపించకపోవడంతో మామిడి రైతులు దిక్కుతోచక అలమటిస్తున్నారు. భవిష్యత్తులో కూడా గిట్టుబాటు ధరలు వచ్చే పరిస్థితి కనిపించకపోవడంతో మామిడి పంట సాగుపై రైతులు నిరాసక్తత వ్యక్తం చేస్తున్నారు. పాలకుల నిర్లక్ష్యం, జిల్లా అధికార యంత్రాంగం నిస్సహాయత కారణంగా ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరలు రావడం మాట దేవుడెరుగు.పంట కోతల డబ్బులు సైతం చేతినుండి పెట్టాల్సి రావడంతో రైతులు ర్యాంపుల వద్ద రోడ్లపై కాయలను కుమ్మరించి నిరసన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా మండలంలోని సరకల్లు గ్రామానికి చెందిన మామిడి రైతు రమేష్‌బాబు తనకున్న ఐదెకరాల మామిడితోటలో సుమారు ఒకటిన్నర ఎకరాకు పైగా వున్న సుమారు 40 ఏళ్ళ వయస్సు గల కళకళలాడే మామిడి చెట్లును యంత్రాల సాయంతో సోమవారం నరికి నేలమట్టం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈసంఘటన మామిడి రైతుల నిస్సహాయ, దీన పరిస్థితికి అద్దం పడుతోంది. ఈసందర్భంగా రైతు రమేష్‌బాబు ప్రభాతవార్తతో మాట్లాడుతూ మామిడి పంట కాపు వస్తే ఒక బాధ, రాకపోతే మరో బాధలా వుందని తెలిపారు. తాను పండించిన పంటను ఈఏడాది అమ్ముకోవడానికి ఎన్నో బాధలు, కష్టాలు పడ్డానని. మండలంలోని మ్యాంగో ఫల్ప్‌ఫ్యాక్టరీల చుట్టూ రోజుల తరబడి కాళ్లరిగేలా తిరిగినా టోకన్లు సంపాదించుకోలేని పరిస్థితుల్లో పంటను ర్యాంపులు, మండీల్లో రెండు, రెండున్నర రూపాయలకు అయినకాడికి అమ్మినట్లు తెలిపారు. ఈనేపథ్యంలో నాబాధను, కోపాన్ని, నిరసననూ ఎవరిపైనా చూపలేని నిస్సహాయ స్థితిలో ఒకటిన్నర ఏకరాల్లో 40 ఏళ్ళు పాటు కంటికి రెప్పలా కాపాడుకున్న కన్న బిడ్డల్లాంటి చెట్లును అడ్డంగా నరికేయాల్సి వచ్చిందని కన్నీటి పర్యంతమవుతూ వాపోయారు.జిల్లాలో ఈఏడాది మామిడి రైతులకు వచ్చిన పరిస్థితి భవిష్యత్తులో ఏరైతుకు రాకూడదని రమేష్‌బాబుతో పాటు మామిడిరైతులు అంటున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వ మామిడి రైతులను అన్ని విధాలా ఆదుకోవాలని ఆయన విజ్ఞప్తి

## హస్త కళాకారులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

- జిల్లా కలెక్టర్



తిరుపతి కలెక్టరేట్, జూలై 2 ప్రభాతవార్త ః
హస్త కళాకారులు మంచి జీవనోపాధి పెంపొందించుకోవాలంటే వారు తయారు చేసిన వస్తువులు యొక్క ఉప్పత్తి, లాభం ప్రచారం చాలా అవసరం అని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. బుధవారం ఉదయం స్థానిక కలెక్టరేట్ వీసీ హాల్‌లో కలెక్టర్, ఏపీ హ్యాండ్ క్రాఫ్ట్ ఛైర్మన్ డాక్టర్ హరిప్రసాద్‌తో కలిసి డీఆర్ డీఏడీ ఐసీ లేపాక్షి, శిల్పారామం, టూరిజం,నాబర్డ్, హ్యాండ్ లూమ్స్, ఖాధీ బోర్డ్, ఖాదీ విలేజ్, ఇండస్ట్రీస్, ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌ల అధికారులతో, హస్త కళలు, హ్యాండ్ లూమ్స్ కళాకారులు, అసోసియేషన్ సొసైటీల వారితో సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో చుట్టు ప్రక్కల గ్రామాలలోని చిన్న కుటుంబాలు నుంచి కూడా ఎంతో మంది హస్త కళంకారీ కళల పైన ఆధారపడి తమ జీవనోపాధి చేసుకుంటున్నారని తెలిపారు. కళాకారులకు రుణాలు మంజూరు విషయంలో ఎవరూ ఆందోళనలు చెందవద్దని తెలిపారు. హస్త కళాకారుల కార్పొరేషన్ ఛైర్మన్ మాట్లాడుతూ జిల్లాలో హస్త కళాకారుల సంబంధించిన సమావేశం నిర్వహించం చాలా సంతోషంగా ఉందని, కళాకారులను, కళలను కాపాడుకోవాలనేది సీఎం చంద్రబాబు, డెప్యూటీ సీఎం పవన్ కల్యాన్ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని విభాగాల అధికారులు, కళాకారులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తి రైతులకు యూరియా కష్టాలు

### తంగేళ్ళ పాళెం సింగిల్ విండో ముట్టడి
### కొరత అంటున్న రైతులు .. లేదంటున్న అధికారులు

తొట్టంబేడు,జూలై 2 ప్రభాతవార్త
శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని రైతులకు యూరియా కొరత అంటూ గగ్గొలు పెడుతున్నారు.శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ముందస్తు ఖరీఫ్‌లో వాణిజ్య పంటలను పండిస్తారు.గతంలో వేరుశెనగను పండించే వారు. వాతావారణ మార్పుతో కొంత కాలం పంటలను పండించటం మానుకున్నారు. కొంత కాలంగా వరి పంటలను పండిస్తున్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో 32వేల హెక్టార్లలో పండిస్తున్నారు. స్వర్ణముఖి తీరాన రైతులు పంటలను పండించుకుంటున్నారు. అలాగే తొట్టంబేడు మండలంలో ఓ వైపు స్వర్ణముఖి తీరం,మరోవైపు తెలుగుగంగ పరివాహక ప్రాంతంలో విస్తారంగా పంటలు పండిస్తున్నారు. అయితే ఈ ఏడాది రైతులు విస్తారంగా పండిస్తున్నారు.అయితే పంటలకు ఆశిస్తున్న తెగుళ్ళను బాగు చేయటానికి యూరియా వాడకంకు అలవాటు పడ్డారు.దాంతో రైతులు ఎక్కడ యూరియా దొరికితే అక్కడికి పరుగులు తీస్తున్నారు. అయితే నాగార్జున్ యూరియా కంపెని లో ఉత్పత్తి ఆగిపోవటంతో



:తంగేళ్ళ పాళెం సింగిల్ విండో ను ముట్టడించిన రైతులు

యూరియా కొరత ఏర్పడినట్లు సమాచారం. ఇక్కడి డిమాండ్, వేసిన పంటల పరిమాణాన్ని బట్టి 3వేల టన్నులు అవసరమౌతుంది. ఈ మేరకు ప్రభుత్వం సరఫరా అయినట్లు సమాచారం. పోటాష్, కాంప్లెక్స్ ఎరువులు ధరలు అధికంగా ఉండటంతో రైతులు యూరియా పై అధార పడి నిర్వహిస్తున్నారు.

**రైతు సేవా కేంద్రాల ద్వారా సరఫరా:**

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఈ ఏడాది రైతు సేవా కేంద్రాలద్వారా యూరియాను సరఫరా చేస్తున్నారు.ఈ నేపథ్యంలో రైతు సేవా కేంద్రాల ద్వారా అందించినట్లు అధికారులు చెబుతున్నారు.ఈ నేపథ్యంలో రైతులు యూరియా వాడకానికి అలవాటు పడుతున్నారు. ఎకరాకు 3 బస్తాలు యూరియా వాడాల్సి ఉండగా రైతులు 10బస్తాలు వాడుతున్నట్లు సమాచారం. యూరియాకు సంబంధించి నాగార్జున కంపెనీ లాక్ అయ్యింది.దాంతో ఇబ్బంది ఏర్పడింది. వ్యవసాయాధికారులు ఈ ఏడాది రైతు సేవా కేంద్రాలకు యూరియాను తరలించారు. అయితే ముందుజాగ్రత్తగా ఎవరైనా అవసరం అనుకుంటే సింగిల్ విండోల్లో నిల్వ ఉంచారు.దాంతో అక్కడ అందుబాటులో లేకపోవటంతో రైతులు ఆందోళనకు దిగారు. తంగేళ్ళ పాళెం సింగిల్ విండోను ముట్టడించారు.

**వ్యవసాయాధికారి వివరణ:**

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో యూరియా కొరత గురించి వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డిని వివరణ కోరగా యూరియా కొరత లేదన్నారు. ప్రభుత్వ అంచనా మేరకు 3వేల టన్నుల యూరియా అందించారన్నారు.అయితే రైతులు కొందరు ఇతర ఎరువులు ధరలు ఎక్కువగా ఉండటంతో వాడటం లేదన్నారు. అంతేకాక కొందరు రైతులు ముందుజాగ్రత్తగా ఇళ్ళలో స్టాక్ పెట్టుకుంటున్నారన్నారు. మోతాదుకు మించి యూరియా తక్కువ ధర కాబట్టి వాడుకకుంటున్నారని వివరణ ఇచ్చారు.మరో లోడ్ త్వరలోనే వస్తుందని వివరణ ఇచ్చారు.



## కార్మికులకు ఫ్రూట్స్ యూనియన్ మద్దతు

పుంగనూరు, జూలై 2, ప్రభాతవార్త



మునిసిపల్ కార్మికులు చేస్తున్న సమ్మెకు ఫ్రూట్ యూనియన్ నాయకులు మద్దతు తెలిపారు. బుధవారం ఉదయం యూనియన్ నాయకులు ఫ్రూట్ అప్సర్, చందు, లియాఖత్ ఆధ్వర్యంలో కార్మికులకు సంఫీుభావం తెలియజేశారు. వారు మాట్లాడుతు ప్రభుత్వం ఇంజినీరింగ్ కార్మికులకు గుర్తించి తక్షణమే వారి డిమాండ్‌లను పరిష్కరించాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు భక్షు, షబాజ్, సదం, జబ్బీర్, బుద్దు, మహావాలి, అన్వార్, తదితరులు పాల్గొన్నారు.

## తాత్కాలికంగా దీక్షను విరమించిన మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు

పుంగనూరు, జూలై 2, ప్రభాతవార్త



తమ డిమాండ్ల సాధన కోసం మూడు వారాలుగా రిలే దీక్ష చేపట్టిన మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు బుధవారం తాత్కాలికంగా దీక్షను విరమించారు. పురపాలక కార్యాలయం ఎదుట చేపట్టిన ఈ నిరసన కార్యక్రమాలను కార్మిక సంఘ నాయకులు శ్రీరాములు, కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. డిమాండ్లపై ముఖ్యమంత్రి సానుకూలత వ్యక్తం చేశారని, రాష్ట్ర నాయకుల సూచన మేరకు దీక్షను విరమిస్తున్నట్లు వారు తెలిపారు. తమ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్న నమ్మకంతో తాత్కాలికంగా దీక్షను విరమిస్తున్నట్లు తెలిపారు. అవసరమైతే మరలా పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

## పుంగనూరులో పెద్ద ఎత్తున వాహనాలు తనిఖీలు

పుంగనూరు రూరల్ జూలై 2 ప్రభాతవార్త



బుధవారం రవాణా శాఖ అధికారుల సారథ్యంలో పట్టణంలో పెద్ద ఎత్తున వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఎంవీఐ సుప్రియ మాట్లాడుతూ సరైన పర్మిట్, పన్నులు, ఇతర అనుమతులు లేకుండా తిరుగుతున్న కర్ణాటక రిజిస్ట్రేషన్ కలిగిన ఓ ప్రైవేట్ స్కూల్ బస్సును సీజ్ చేశారమని వివరించారు. స్కూల్ బస్సు నడపాలంటే కనీసం 5 సంవత్సరాల డ్రైవింగ్ అనుభవం ఉండాలని పేర్కొన్నారు. పిల్లల భద్రత దృష్టిలో పెట్టుకొని అనుభవం ఉన్నవారినే డ్రైవర్లుగా నియమించుకోవాలని ఆమె సూచించారు. ప్రతి ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం ఈ నియమాలు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు.

## జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా అమరేంద్ర కుమార్

సోమల, జూలై 2, ప్రభాతవార్త



సోమల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఎన్ అమరేంద్ర కుమార్ పదవి బాధ్యతలను చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న గంగాధర్ నాయుడు బదిలీపై పుంగనూరు కళాశాలకు వెళ్లడంతో అమరేంద్ర కుమార్ బదిలీల్లో భాగంగా సోమల కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టారు. గుర్రంకొండ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ గా పనిచేస్తున్న ఈయన బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా అధ్యాపకులు ప్రిన్సిపాల్‌కు పుష్పగుచ్చంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

## విద్యార్థి దశలో వ్యాపార నైపుణ్యాలు అవసరం

ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రమౌళి



**పుత్తూరు, జూలై 2 ప్రభాతవార్త :** డిగ్రీ స్థాయిలోనే విద్యార్థుల్లో దాగి వున్న అంతర్గత శక్తి, నైపుణ్యాలను వెలికి తీయగలిగితే వారు వ్యాపారవేత్తలుగా రాణిస్తారని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ బి.చంద్రమౌళి అన్నారు. బుధవారం కాలేజీలో డిగ్రీ విద్యార్థుల్లో వ్యాపార నైపుణ్యాలను, సృజనాత్మక శక్తులను వృద్ధి చేయడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఐక్యరాజ్యసమితిలోని యూనిసెఫ్‌తోనూ, రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌తో కలిసి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ట్ అనే కార్యక్రమ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. లక్షలాది మంది డిగ్రీ విద్యార్థులకు ఆన్ లైన్‌లో వివిధ వ్యాపార, వాణిజ్యాలకు సంబంధించి అంశాలపై శిక్షణ ఇవ్వడం ఈ పథకం లక్ష్యమని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ పోర్టల్ ద్వారా నలుగురు విద్యార్థుల చొప్పున ఒక బృందంగా నమోదు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జి.కోటేశ్వరయ్య, యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ట్ కార్యక్రమ సమన్వయకర్తలు డాక్టర్ జి.తిరుమలయ్య, డాక్టర్ సి.నర్సింహారెడ్డి పలువురు విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం

గంగవరం,జూలై 2, ప్రభాతవార్త



వైఎస్సార్‌సీపీ పలమనేరు నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటే గౌడ ఆధ్వర్యంలో బుధవారం గంగవరం మండలంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చిత్తూరు జిల్లా వైసీపీ అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజర య్యారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడం, అధికారంలోకి వచ్చాక మోసపూరిత పాలన సాగించడాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్ళేలా రూపొందించిన "రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో"ను క్యూఆర్ కోడ్ స్కానింగ్ ద్వారా ప్రజలకు అందించడానికి ప్రారంభించారు. "బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ" అనే నినాదంతో ప్రజల్లో చైతన్యం రేకెత్తించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు అమలు కానీ హామీలతో ప్రజలను నమ్మించారని ఇంటింటికీ హామీల బాండ్లు పంపించి అధికారంలోకి వచ్చారని, కానీ ఒక్క హామీ కూడా సక్రమంగా నెరవేర్చలేదని ఆయన ధ్వజమెత్తారు. అనంతరం పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ మాట్లాడుతూ సూపర్ సిక్స్ పేరుతో ప్రజలను మభ్యపెట్టారని, గత ప్రభుత్వంలో ఇచ్చిన హామీలకంటే ఒక కొత్త పిఛన్ అయినా మంజూరు చేశారా అని ప్రశ్నించారు. వైసీపీ ఆధ్వర్యంలో వెన్నుపోటు కార్యక్రమం చేపట్టాకే తల్లికి వందనం అరకొరగా అమలు చేశారని ఆయన ఎద్దేవ చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు మొగసాలక్రిష్ణమూర్తి, చెంగారెడ్డి, హేమంత్‌కుమార్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, బాగారెడ్డి, చలపతిరెడ్డి, మహేష్, యువరాజు, శశిధర్‌నాయుడు, రాధాక్రిష్ణ, అనిల్‌లతో పాటు నియోజకవర్గ ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

## కాటిపేరిలో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

చౌడేపల్లి, జూలై 2 ప్రభాతవార్త



పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన చౌడేపల్లిలో చోటు చేసుకొంది. మండలంలోని పంచాయతీ కేంద్రం కాటిపేరికి చెందిన సుబ్రమణ్యం(46)వ్యవసాయ కూలీగా జీవిస్తున్నాడు. ఈక్రమంలో కుటుంబంలో ఏర్పడ్డ కలహాల మూలంగా ఇంట్లో వున్న పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో పడున్న అతన్ని స్థానికులు పుంగనూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ అతని ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మదనపల్లి జిల్లా ఆసుపత్రికి సిఫారస్సు చేసారు.

## శ్రీలఘు వైష్ణవీదేవిగా అమ్మవారు

చౌడేపల్లి, జూలై 2 ప్రభాతవార్త



శ్రీలఘు వైష్ణవీదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చింది. పుదిపట్ల స్వయంభు వైష్ణవీదేవి ఆలయంలో జరుగుతున్న వారాహీమాతా నవరాత్రుల సందర్భంగా 7వ రోజున ప్రధానార్చకురాలు శ్రావణి ఆధ్వర్యంలో అమ్మవారికి విశేషాభిషేకం, శ్రీలఘు అలంకరణ గావించారు. అమ్మవారిని దర్శించుకొన్నవారికి భయ నివారణ, రక్షణ, విజయం చేకూరందన్న నమ్మకం భక్తుల్లో వుంది. దీంతో ఇతర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. పుంగనూరుకు చెందిన రామస్వామిరెడ్డి, మాధివిలు ఉభయదారులుగా వ్యవహరించారు. ఆలయ నిర్మాణకర్త వినోద్‌కుమార్‌రెడ్డి పవిత్ర తర్థీ ప్రసాదాలందించారు.

## అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

-పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్

కాణిపాకం, జూలై 2 ప్రభాతావార్త:



రాష్ట్ర ప్రజల అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ అన్నారు. కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా బుధవారం సుపరిపాలనతో తొలి అడుగు కార్యక్రమాన్ని ఐరాల మండలం వడ్రాంపల్లె ఆ్రమ పంచాయతీలో ఎమ్మెల్యే ప్రారంభించారు. పంచాయతీ పరిధిలోని వడ్రాంపల్లె, దామరగుంట, మిట్టిండ్లు, లింగారెడ్డియిండ్లు గ్రామాల్లో మండల టీడీపీ నాయకులతో కలసి ఇంటింటికి వెళ్ళి ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వ సాధించిన అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు గురించి వివరాస్తూ కరపత్రాలను అందజేశారు. అలాగే ఆయా గ్రామాల్లో ప్రజల నుండి సమస్యలపై వినతిపత్రాలను స్వీకరించారు. అలాగే దామర గుంట పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థుల విద్యా ప్రమాణాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో ఐరాల మండల టీడీపీ అధ్యక్షుడు గంగారపు హరిబాబునాయుడు, మాజీ అధ్యక్షుడు గిరిధర్‌బాబు, బంగారుపాళ్యం మార్కెట్ కమిటీ అధ్యక్షుడు భాస్కర్‌నాయుడు, మాజీ జడ్పీటీసీ ఎం.లత, కాణిపాకం ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు, మండల నాయకులు హేమాద్రినాయుడు, మనోహర్‌నాయుడు, పూర్ణచంద్రరావు, నరసింహులునాయుడులతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## అర్హులందరికి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు

-పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్

**తవణంపల్లె, జూలై 2 ప్రభాతవార్త:**



అర్హులందరికి ప్రభుత్వ పథకాలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ అన్నారు. కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా బుధవారం సుపరిపాలనతో తొలి అడుగు కార్యక్రమాన్ని మండలంలోని తెల్లగుండ్లపల్లె గ్రామపంచాయతీలో నిర్వహించారు. ఈసందర్భంగా పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో నాయకులతో కలసి ఇంటింటికి వెళ్ళి కూటమి ప్రభుత్వ ఏడాది కాలంలో అమలు చేసిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి ప్రభుత్వ పథకాలు అందేలా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈకార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు బొమ్మన శ్రీధర్, రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ చౌదరి, మండల పార్టీ అధ్యక్షుడు దిలీప్‌నాయుడు, బంగారుపాళ్యం మార్కెట్ కమిటీ ఛైర్మన్ భాస్కర్‌నాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జిలు మోహన్‌నాయుడు, సునీల్‌చౌదరి, ఐరాల మండల అధ్యక్షుడు హరిబాబునాయుడు, మాజీ అధ్యక్షుడు గిరిధర్‌బాబులతోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## ఈఓచే నిత్యాన్నదానం ఆకస్మికంగా తనిఖీ

కాణిపాకం, జూలై 2 ప్రభాతవార్త:



కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం అమలు చేస్తున్న నిత్యాన్నదాన కార్యక్రమాన్ని ఆలయ ఈఓ పెంచల కిషోర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా భక్తులు అందిస్తున్న ఆహార పదార్థాలు శుచి శుభ్రంగా వున్నాయి?లేదా? అని పరిశీలించారు. అలాగే వంటశాలను ఆయన పరిశీలించారు. ఆహార పదార్థాల రుచిపై భక్తుల అభిప్రాయాలను ఈఓ అడిగి తెలుసుకున్నారు. భక్తులకు ప్రతిరోజూ శుచి శుభ్రతతో కూడిన నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఆయన సంభందిత అధికారులు, సిబ్బందికి సూచించారు. ఈఓ వెంట అన్నదాన భవన్ ఇన్‌చార్జి ఏఈఓ ఎస్వీ.కృష్ణారెడ్డి తదిరతులు పాల్గొన్నారు.

## 10న కాణిపాకంలో శాకాంబరి అలంకారం

కాణిపాకం, జూలై 2 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానం ఈనెల 10న ఆషాడ పౌర్ణమి సందర్భంగా శాకాంబరి అలంకారం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్ తెలిపారు. ఈసందర్భంగా దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీమరగదాంభిగా సమేత మణికంఠేశ్వరాయలంలోని శ్రీమరగదాంభికా దేవి, దుర్గాదేవి అమ్మవార్లకు, ప్రధాన ఆలయంలో శాకాంబరి అలంకారం (వివిధ రకాల కూరగాయలు,పండ్లుతో) నిర్వహించి ఉదయం 6 గంటల నుండి భక్తులకు దర్శనం కల్పించబడునని తెలిపారు, ఆషాడ పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి శాకాంబరి అలంకారం నిర్వహించనున్నట్లు ఈకార్యక్రమంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు. శాకాంబరి అలంకారం కోసం కావలసిన వివిధ రకాములైన కూరగాయలను ఉచితంగా స్వీకరించనున్నట్లు తెలిపారు. కూరగాయలు సమర్పించే భక్తులు ఈనెల 9న శివాలయంలో అర్చకులకు సమర్పించాలని ఈఓ పెంచల కిషోర్ తెలిపారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## కార్మికులకు ఎల్లప్పుడు అండగా వైకాపా



– వైకాపా నాయకులు

చిత్తూరు, జులై 2 ప్రభాతవార్త:

వైకాపా కార్మికులకు నిరంతరం అండగా నిలుస్తోందని వైకాపా నాయకులు అన్బు, కెపి శ్రీధర్‌లు పేర్కొన్నారు. సమస్యలను పరిష్కరించాలని తొమ్మిది రోజుల పాటు నిరసనలు చేపట్టి తాత్కాలిక విరామం ప్రకటించి విధులకు హాజరైన మున్సిపల్ కార్మికులు, సిబ్బందిని బుధవారం చిత్తూరు వైకాపా నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఎంసి విజయానందరెడ్డి సూచనలతో వైకాపా నాయకులు కెపి శ్రీధర్, అన్బు తదితరులు కలిసి ఆహారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులకు వైకాపా ప్రభుత్వం తగిన సహాయ సహకారాలు అందించి వారి సమస్యలను పరిష్కరించేదన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ లక్ష్మణస్వామి, వైకాపా నాయకులు జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పేదలు లేని సమాజ స్థాపన లక్ష్యంగా అడుగులు

– ఎంపీ దగ్గుమళ్ళ, ఎమ్మెల్యే గురజాలలు

చిత్తూరు, జులై 2 ప్రభాతవార్త:



రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం పేదలు లేని సమాజ స్థాపన లక్ష్యంగా అడుగులు వేస్తోందని ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడులు పేర్కొన్నారు. సిఎం నారా చంద్రబాబునాయుడు ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంను బుధవారం ఎం.ఆగ్రహారంలో ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడులు ప్రారంభించారు. దొడ్డిపల్లిలోని అమ్మవారి ఆలయంలో ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడులు ప్రత్యేక పూజలు నిర్వహించి సుపరిపాలనలో తొలి అడుగు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఇంటింటికి తెలుగుదేశం పార్టీలో భాగంగా గ్రామంలోని ప్రతి గడపకు వీరు వెళ్ళి సుపరిపాలనలో తొలి అడుగు కరపత్రాలను ప్రజలకు అందజేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సూపర్ సిక్స్ పథకాలు అందుతున్నాయని, తమ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వమని, అభివృద్ధి, సంక్షేమం పరమావధిగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సిఆర్ రాజన్, మాజీ ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు, మేయర్ అముద, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, టిడిపి సీనియర్ నాయకులు కాజూరు బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## చెత్త సేకరణపై అవగాహన

పెనుమూరు, జులై 2 ప్రభాతవార్త:



గ్రామాల్లో ఇంటింటి చెత్త సేకరణపై అవగాహన కల్పించడానికి ప్రజలకు పలు సూచనలు ఇవ్వడం జరుగుతుందని ఎంపిడిఓ నీలకంఠేశ్వర్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని గుంటుపల్లి గ్రామంలో బుధవారం చెత్త సేకరణపై ఎంపిడిఓ నీలకంఠేశ్వర్‌రెడ్డి ప్రజలు, మహిళలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మండల పరిధిలో 13 గ్రామ పంచాయతీల్లో ఈ నెల 10వ తేదీ నుండి మహిళలకు ఐవిఆర్ఎస్ కాల్స్ వస్తాయని, అందులో చెత్త సేకరణపై అభిప్రాయాలు తెలుసుకుంటారని, కాల్స్ వచ్చినపుడు ప్రజలు స్పందించాలని తెలిపారు. అలాగే మండల పరిధిలో మంచినీటి సమస్య ఉత్పన్నం కాకుండా అందుబాటులో వున్న అన్ని మంచినీటి వనరులను వినియోగంలోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపిడిఓ పేర్కొన్నారు.

## జనసేనలో చేరిన వైకాపా నాయకులు

– పవన్ కళ్యాణ్ ఆశయ సాధన మా ధ్యేయం

పాలసముద్రం, జులై 2 ప్రభాతవార్త:



పాలసముద్రం మండల పరిధిలో కొంతమంది వైకాపా నాయకులు జనసేన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా జనసేనలో చేరిన వైకాపా నాయకులు డిప్యుటీ సిఎం పవన్‌కళ్యాన్ ఆశయ సాధనే లక్ష్యంగా తాము క్షేత్ర స్థాయిలో పని చేసి పార్టీని మరింత బలోపేతం చేస్తామని ప్రకటించారు. జిడినెల్లూరు నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జ్ డాక్టర్ యుగంధర్ పొన్నా సమక్షంలో బుధవారం ఆముదాల పంచాయతీ లక్ష్మీపురం గ్రామంకు చెందిన వైకాపా నాయకురాలు పద్మతో పాటు కార్యకర్తలు జాన్సన్‌కుమార్, హుస్సేన్, అబ్బాస్, వెంకటేష్, ముత్తుకుమార్, మనోజ్, తేజస్ తదితరులు జనసేన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జ్ డాక్టర్ యుగంధర్‌పొన్నా వారిని పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పాలసముద్రం మండల జనసేన పార్టీ అధ్యక్షుడు లతీష్‌కుమార్, ఉపాధ్యక్షులు జవాద్‌ఆలీ, ప్రధాన కార్యదర్శి భక్తవత్సలం, కార్యదర్శి ప్రవీణ్, సీనియర్ నాయకులు గోపినాథ్, రావూరి చందు, గిరి తదితరులు పాల్గొన్నారు.

## 9న బంగారుపాళ్యంకు వైఎస్ జగన్

– మామిడి రైతులకు పరామర్శ

చిత్తూరు, జులై 2 ప్రభాతవార్త:

వైకాపా అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఈ నెల 9వ తేదీ బంగారుపాళ్యం వస్తున్నారు. గిట్టుబాటు ధర లేక అల్లాడుతున్న మామిడి రైతులను పరామర్శించడానికి వైకాపా అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఈ నెల 9వ తేదీ బంగారుపాళ్యం మార్కెట్ యార్డుకు వస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మామిడి రైతులకు అండగా నిలిచి మామిడికి గిట్టుబాటు ధర కల్పించాలని ఆయన ప్రభుత్వంను డిమాండ్ చేయనున్నారు. ఇందుకు సంబంధించి వైఎస్ జగన్ పర్యటన షెడ్యూల్ ఒకటి రెండు రోజుల్లో విడుదల కానుందని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.

## క్యాన్సర్ బాధిత బాలుడికి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ఆర్థిక సాయం

చౌడేపల్లి, జూలై 2 ప్రభాతవార్త



ఎముకల క్యాన్సర్‌తో బాధపడుతున్న బాలుడికి మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆర్థిక సాయం చేసారు. చౌడేపల్లి పరిదిలోని గడ్డంవారిపల్లి మార్గంలోని వైఎస్సార్ కాలనీలో నివసించే షాజహాన్ కుమారుడు షాహిద్(16)కు ఇటీవల ఎముకల క్యాన్సర్ సోకింది. కొయ్యపని చేసుకొంటూ జీవిస్తున్న షాజహాన్ బాలుడికి మెరుగైన వైద్యం అందించలేక పోయాడు. దీంతో వైకాపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జడ్పీటీసీ నడింపల్లి దామోధర్‌రాజుకు సమస్యను వివరించారు. ఆయన మాజీ మంత్రి పెద్దిరెడ్డి దృష్టికి తీసుకెళ్ళారు. వెంటనే స్పందించిన ఆయన బాలుడికి రూ. 10వేల ఆర్థికసాయాన్ని దామోధర్‌రాజు చేతుల మీదుగా అందించాడు. అదే విధంగా పిఎం రిలీఫ్ ఫండ్‌ను అనుసరించి మెరుగైన వైద్యం ఇప్పిస్తామని హామీ ఇచ్చారు.

## పంచాయతీల ప్రగతే కూటమి ప్రభుత్వ లక్ష్యం: సింగమాలకు మహర్ధశ

బొజ్జల సుధీర్‌రెడ్డి

సింగమాలతో తొలిఅడుగుకు శ్రీకారం

తొట్టంబేడు,జూలై 2 ప్రభాతవార్త



పంచాయతీల ప్రగతే దేశ ప్రగతి అన్న గాంధీజీ కలలు గన్న గ్రామస్వరాజ్యాన్ని నేడు ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు, డెప్యూటి సిఎం పవన్‌కళ్యాణ్, యువ నాయకుడు నారా లోకేష్‌లు అమలు చేస్తున్నారని శాసన సభ్యుడు సుధీర్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ పిలుపుమేరకు తొలిఅడుగు కార్యక్రమాలను నియోజకవర్గంలోని ఈశాన్య మూల ఉన్న సింగమాలలోని వీరభద్రస్వామి ఆలయంలో పూజలు నిర్వహించి శ్రీకారం చుట్టారు. సాధారణంగా బొజ్జల కుటుంబం ఎన్నికల ప్రచారాన్ని కూడా ఇక్కడ నుంచి శ్రీకారం చుట్టడం ఆనవాయితి. ఈ సందర్బంగా పంచాయతీలో చేపట్టిన ప్రగతికి సంబంధించి సుధీర్‌రెడ్డి గ్రామస్థులకు వివరించారు. ఈ గ్రామంలో చేపట్టిన అభివృద్దిని వివరంచారు. ఏడాది పాటు పంచాయతీలో చేపట్టిన పనుల్లో ముఖ్యంగా రూ.3కోట్లు 52లక్షల 78వేల 532ల విలువ గల అభివృద్ది పనులను చేపట్టినట్లు తెలిపారు. ఎన్‌టిఆర్ భరోసా పథకంలో 248మంది లబ్దిదారులకు రూ.1.24కోట్లు అందించామన్నారు. తల్లికి వందనలో 128 మంది లబ్దిదారులు రూ.16.6లక్షలు దీపం పథకంలో 136మందికి రూ.3.5లక్షలు, పశువుల తాగునీటి సదుపాయానికి రూ.75 వేలు, గోకులం షెడ్డులు, సిసి రోడ్డు, స్వయంసహాయక సంఘాలకు రూ.1.9కోట్లు, శ్మశానం అభివృద్ధి, బోర్లులకురూ.3లక్షలు పశువుల దాణా సబ్సిడీ, ఎరువుల సబ్సీడీ విద్యార్థులకు కిట్లు అన్నదాత సుఖీభవలో త్వరలో 92 మందికి అందించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమాల్లో మండల పార్టీ అధ్యక్షుడు రావిళ్ళ మునిరాజా నాయుడు భారీ ఎత్తున ఏర్పాటు చేసారు. నాయకులకు ఘనస్వాగతం పలికారు. నియోజకవర్గంలో శాసనసభ్యుడు తొలి అడుగు మొదటి సమావేశం కాబట్టి నియోజకవర్గ పరిశీలకులు అంకయ్య చౌదరి రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతి నాయుడు, దేశం నాయకులు చెంచయ్యనాయుడు, దశరధాచ్చారి, జయచంద్రనాయుడు, కన్నలి ప్రతాప్ ంరెడ్డి, రమేష్, వాకచర్ల గుర్రప్ప, కుమారస్వామి, కమల్, సునీల్, గోపి, చంద్రారెడ్డి, భాస్కర్‌నాయుడు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## స్వర్ణ నారావారిపల్లె-2029 అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలను పూర్తి చేయాలి

తిరుపతి కలెక్టరేట్, జూలై 02 ప్రభాతవార్త ః



స్వర్ణ నారావారిపల్లె-2029 అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలను త్వరితగతిన సిద్ధం చేసి పనులు చేపట్టాలని, అన్ని గ్రామాలలో ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి కావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. బుధవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో స్వర్ణ నారా వారిపల్లె-2029 అభివృద్ధి కార్యక్రమాలపై ప్రత్యేక అధికారిని సుశీలాదేవి , సంబంధిత అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. పనులు పూర్తి చేసేవిధంగా తగు చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో స్వర్ణ నారావారి పల్లె-2029కి సంబంధిం చిన జిల్లా అధికారులు పాల్గొన్నారు

## సిఎం చంద్రబాబుకు ఘనస్వాగతం

శాంతిపురం, జూలై 2 ప్రభాతవార్త



రెండు రోజుల కుప్పం పర్యటన నిమిత్తం విచ్చేసిన సిఎం చంద్రబాబునాయుడుకు ప్రజాప్రతినిధులు, అధికారులు ఘనస్వాగతం పలికారు. బెంగళూరు నుంచి రోడ్డు మార్గంలో సిఎం చంద్రబాబు నాయుడు తులసినాయనపల్లి బహిరంగసభ ప్రాంగణం వద్దకు మధ్యాహ్నం 3.05గంటలకు చేరుకున్నారు. అక్కడ ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, చిత్తూరు ఎంపి దగ్గుమళ్ల ప్రసాదరావు, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, కడ పి.డి. వికాస్ మర్మత్, జాయింట్ కలెక్టర్ విద్యాధరి, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి డా॥ బిఆర్ సురేష్‌బాబు, మాజీ ఎమ్మెల్సీలు గౌనివారి శ్రీనివాసులు, దొరబాబు, చుడా ఛైర్మన్ కఠారి హేమలత, టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, రాష్ట్ర విద్య మౌలిక వసతుల కార్పోరేషన్ ఛైర్మన్ రాజశేఖర్, మండల టిడిపి అధ్యక్షులు విశ్వనాథనాయుడు, రాజ్‌కుమార్ తదితరులు ఘనస్వాగతం పలికారు.

## ఘనంగా డాక్టర్స్‌డే వేడుకలు

తిరుపతి హెల్త్, జూలై 02 ప్రభాతవార్త ః



ఇంపాక్ట్ ఇంటర్నేషల్ విస్‌డమ్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రెసిడెంట్లు కొత్తకోట లక్ష్మి ప్రసన్న, పీఎన్ కుమార్, ప్రాజెక్టు డైరెక్టర్ ధనంజయ, ఇంపాక్ట్ ట్రైనర్ సభ అధ్యక్షతన ఘనంగా బుధవారం డాక్టర్స్‌డే వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇంపాక్ట్ రీజనల్ ప్రెసిడెంట్ తహ సున్నీసా భేగం హాజరై మాట్లాడారు. ఒక డాక్టర్ కావాలంటే పది సంవత్సరాల పాటు వాళ్ళ జీవితాన్ని త్యాగం చేయాల్సి ఉంటుందన్నారు. ఏ డాక్టర్ అయితే సేవా గుణంలో పనిచేస్తారో వాళ్ళని నారాయణుడిగా భగవాన్ నారాయణుడిగా ప్రజలు కొనియాడుతారన్నారు. ప్రస్తుతం ఉన్న కార్పొరేట్ సెక్టార్ నుంచి కమర్షియల్ డాక్టర్ల చేత డాక్టర్స్‌కు ఉన్న విలువలు తగ్గిపోతున్నాయని తెలిపారు. కానీ ఇప్పటికీ చాలా మంది డాక్టర్లు సేవా భావంతో మానవతా దృక్పథంతో పనిచేస్తున్నారన్నారు. ఇంపాక్టెడ్ ట్రైనింగ్ డైరెక్టర్ ప్రేమ్ మాట్లాడుతూ తమ ఇంపాక్ట్ సంస్థలో ఇంత మంది డాక్టర్లు తమ సేవలను అందిస్తున్నందుకు వాళ్ళని అభినందించారు. ఇంపాక్ట్ సభ్యులు సుబ్రమణ్యం మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో తాను కూడా పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ట్రెజర్ హైమావతి, నారీ సెల్ డైరెక్టర్ సుజాత, ఇంపాక్ట్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ డాక్టర్లును తహ సున్నీసా భేగం, సభ్యులు ఘనంగా సన్మానించారు.

# నగరంలో రూ. 60 కోట్లతో అభివృద్ధి పనులు

## - ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి కార్పొరేషన్, జూన్ 2, ప్రభాతవార్త
ఏడాది కాలంలో నగరంలో 60 కోట్ల రూపాయల నిధులతో అభివృద్ధి పనులు చేస్తున్నామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. 33, 9వ డివిజన్ల పరిధిలోని అబ్బన్న కాలనీలో మారుతీనగర్ పరిధిలో 19.25 లక్షలతో నూతనంగా నిర్మించిన యూజిడి లైన్, సిసి డ్రైన్, సిసి రోడ్లను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, కార్పొరేటర్లు దూది కుమారి, నరసింహాచ్చారి, నరేంద్ర, సికే రేవతి, శైలజ, వరికుంట్ల నారాయణలు బుధవారం ఉదయం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏడాది కాలంగా నగరపాలక సంస్థలో పారదర్శకంగా పాలన అందిస్తున్నామని అన్నారు. గతంలో కార్పోరేషన్ పై 150కోట్ల అప్పుల భారం మోపగా, ప్రాధాన్యత క్రమంలో 75కోట్లు చెల్లించినట్లు ఆయన చెప్పారు. నగర



అభివృద్ధికి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కట్టుబడి 60కోట్లతో వివిధ రకాల పనులు చేపట్టి కొన్ని పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. మిగిలిన పనులు కొనసాగుతున్నట్లు ఆయన చెప్పారు. రానున్న వర్షాకాలంను దృష్టిలో ఉంచుకుని డ్రైయిన్‌లలో షిల్ట్ తీసి నీరు నిల్వకుండా చూస్తామని ఆయన తెలిపారు. కమిషనర్ ఎన్ మౌర్య మాట్లాడుతూ భూగర్భ డ్రైనేజీ సమస్యలు ఎక్కువగా ప్రజల నుంచి వస్తున్నాయని చెప్పారు. నగరంలోని మురుగునీరు తూకివాకం వెళ్ళే అవుట్ పాల్ ఏరియా రేణిగుంట ప్రాంతంలో రోడ్డు మధ్యలో కుంగిపోయిందని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఈ సమస్యను పరిష్కరించాలని కోరామని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ముందుకొచ్చి సుమారు 20 కోట్లతో డెమానుస్ట్రేషన్ ప్రాజెక్ట్‌గా పరిష్కరించేందుకు ఆమోదం తెలిపింది అన్నారు. డ్రైనేజీ కాలువలు, డ్రైన్స్, సిసి రోడ్లు, వీధి లైట్ల సమస్యలు ఎదురైతే వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## పాఠశాల విలీనాన్ని నిరసిస్తూ చెన్నై జాతీయ రహదారి ముట్టడి..!

నారాయణవనం, జూలై 2 ప్రభాతవార్త :



ప్రభుత్వం ఇటీవల తీసుకున్న పాఠశాలల విలీనంతో పేద పిల్లలకు అన్యాయం జరుగుతుందని మండలంలోని కశిమిట్ట పంచాయతీ ఇప్పతాంగేల్ గ్రామానికి చెందిన విద్యార్థుల తల్లితండ్రులు, బిఎస్పీ నాయకుల ఆధ్వర్యంలో పుత్తూరు చెన్నై జాతీయ రహదారిపై బుధవారం ఉదయం నిరసనకు దిగారు. ఈ సందర్భంగా వారు బిఎస్పీ నియోజకవర్గ ఇంచార్జీ కె ధనంజయులు మాట్లాడుతూ ఇప్పతాంగేల్ ప్రాథమిక పాఠశాలలోని 3,4,5 తరగతును సుమారు 3 కిలో మీటరు దూరంలోని దిగువ కనకపాలెం పాఠశాలలో కపడంతో ఇక్కడ కూడా ఇదే సమస్య ఎదురవుతుందని తల్లితండ్రులు మండపడుతున్నారు. దీంతో సుమారు 50మంది వున్న పిల్లల సంఖ్య కేవలం 17మందికి పరిమితం అవుతుందని, ఇకపోతే దిగువకనకపాలెం పాఠశాలకు వెళ్లాలంటే చెరువులు, పెద్ద పెద్ద కాలువలను దాటుకొని వెళ్లాలన్నారు. వర్షం కురిస్తే ఇప్పతాంగేల్ గ్రామం నుంచి వెళ్లడం పిల్లలకు కుదరదన్నారు. దీంతో నిరుపేద దళిత పిల్లలకు చదువును దూరం చేయడమేనన్నారు. పాఠశాలకు అయినా నిలిచిపోతామని, అంత దూరం వెళ్లమని పిల్లలు తేల్చి చెబుతున్నారు. అలాగే బొబ్బరాజుపాలెం పంచాయతీ లక్ష్మీపురంయానాధికాలనీ ప్రాథమిక పాఠశాలలో స్థానికంగా వున్న సుమారు 50మంది పిల్లలు వుండేవారన్నారు. వీరికి ఇద్దరు టీచర్లను ప్రభుత్వం నియమించిందన్నారు. అయితే ప్రస్తుత విలీనంతో సుమారు 2 కిలో మీటీరు దూరంలోని సముదాయం పాఠశాలకు ఇక్కబ చదువుతున్న 3,4,5 తరగతులను కలపడంతో కష్టాలు మొదలైందన్నారు. దీంతో ఇక్కడ నుంచి సుమారు 35మంది వరకు పిల్లలు అంతా దూరం వరకు వెళ్లాల్సి వుందన్నారు. అలాగే ఒక టీచర్‌ని కూడా వేరే చోటకు పంపారన్నారు. ఇలా చేయడం వల్ల గిరిజన పిల్లలు చదువుకు దూరం చేయడమేనని మండిపడ్డారు. వెంటనే ప్రభుత్వం ఈ చర్యను ఉపసంహరించుకోవాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు స్పందించి మరోసారి ఆలోచించి నిర్ణయం తీసుకోవాలన్నారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరిస్తున్నారు.

## ఏర్పేడు మండల అభివృద్ధికి సుధీర్‌రెడ్డి కృషి విశేషం

### ముసలిపేడులో తొలిఅడుగు

శ్రీకాళహస్తిరూరల్, జూలై 2 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ఏర్పేడు మండలం కీలకమైనదని ఈ మండల అభివృద్ధికి ఏడాదిలో ఎన్నో పరిశ్రమలను సాధించి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించిన ఘనత ఒక్క సుధీర్‌రెడ్డికే దక్కుతుందని మండల పార్టీ అధ్యక్షుడు పేరం నాగరాజనాయుడు అన్నారు. మండలంలోని ముసలిపేడులో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన పిలుపు మేరకు పార్టీ అధ్యక్షుడు నాగరాజు నాయుడు కార్యక్రమాలను అమలు చేసారు. ఈ సందర్బంగా మండలంలోని విమానాశ్రయం అభివృద్ధితో పాటు పరిసరాల్లో పరిశ్రమలలో నిరుద్యోగులకు ఉపాధి కల్పించుటకు ఆయన కృషి విశేషం అన్నారు. ఈ సందర్బంగా ఏడాదిలో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలతో పాటు నియోజకవర్గంలోని ఏర్పేడు మండలంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను కర పత్రాల ద్వారా ముద్రించి ఇంటింటికి పంపిణి చేసారు. ఈ కార్యక్రమాల్లో మాజీ జడ్‌పిటిసి పేరం ధనంజయులు నాయుడు, రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురువారెడ్డి, మోహన్‌నాయుడు, శివశంకర్‌రెడ్డి, రాఘవేంద్ర, సురేష్, చంద్రశేఖర్‌నాయుడు, కృష్ణ వేణి, హంస, సీతాపతి ఆచారి, బాబు, రవినాయుడు, సుబ్రమణ్యం సుగుణా యాదవ్, చిన్నయ్య, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. కాగా బండారుపల్లి స్వగ్రామంలో రాష్ట్ర అధికార ప్రతినిధి గురువారెడ్డి సారధ్యంలో ఇంటింటికి తొలిఅడుగు కార్యక్రమాలను వివరించారు. విద్యాకమిటి చైర్మెన్ చెంచురెడ్డి, నాదమని శెట్టి, మురళి యాదవ్, ధనంజయులు, గురవయ్యయాదవ్, మునికృష్ణయ్య యాదవ్, బాలకృష్ణ, వెంకటేష్ శివ తదితరులు పాల్గొన్నారు.

## అనిమల్ హస్బెండరీ పాలిటెక్నిక్ ప్రవేశాలకు 7 వరకు గడువు

తిరుపతి విద్య, జూలై 2 ప్రభాత వార్త
ఎస్వీ వెటర్నరీ వర్సిటీ ఆధ్వర్యంలో రెండు సంవత్సరాల కాలవ్యవధితో నిర్వహిస్తున్న అనిమల్ హస్బెండరీ పాలిటెక్నిక్ కోర్సులో ప్రవేశాలకు ఈనెల 7వ తేదీవరకు దరఖాస్తు గడువు పొడిగించినట్లు రిజిస్ట్రార్ ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన ఆసక్తిగల విద్యార్థులు ఆన్లైన్ దరఖాస్తుల కోసం వర్సిటీ అధికారిక వెబ్సైట్ ను సంప్రదించాలని కోరారు.

## ఇంటర్మీడియట్ అడ్మిషన్ల గడువు పొడిగింపు.

తిరుపతి విద్య జూలై 2 ప్రభాత వార్త
2025-2026 విద్యా సంవత్సరమునకు గాను ఇంటర్మిడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశం కొరకు నిర్ణీత గడువు తేదీని జూలై 31 వతేది వరకు పొడిగించినట్లుగా తిరుపతి జిల్లా ఆర్ ఐ ఓ జి రాజశేఖర్ రెడ్డి తెలియజేశారు. అంతే కాకుండా నిర్ణీత గడువు తేది ని ఇక మీదట పొడిగించబడదని ఒక ప్రకటనలో తెలిపారు.

## అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

తొట్టంబేడు, జూలై 2 ప్రభాతవార్త
శ్రీకాళహస్తిలోని విద్యాప్రకాశనందగిరి తొట్టంబేడు జూనియర్ బాలికల కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ భారతి బుధవారం తెలిపారు. వృక్షశాస్త్రం అధ్యాపకులు పోస్టుఖాళీగా ఉన్నట్లు వివరించారు. ఆసక్తి కల్గిన వారు సంబంధిత సబ్‌జెక్టులో పిజి చేసి అనుభవం ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. 4వ తేది సాయంత్రం లోపల దరఖాస్తు చేయాలన్నారు.

## త్వరలోనే అర్హులైన వీధి విక్రయదారులందరికీ గుర్తింపు కార్డులు

### - కమిషనర్ ఎన్.మౌర్య

తిరుపతి కార్పొరేషన్, జూన్ 2, ప్రభాతవార్త



నగర్ పరిధిలో అర్హులైన వీధి విక్రయదారులు గుర్తించి అందరికీ నగరపాలక సంస్థ తరపున గుర్తింపు కార్డులు త్వరలో అందిస్తామని కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. వీధి విక్రయదారులను గుర్తించడం, నిబంధనలపై వార్డ్ వెల్ఫేర్ సెక్రటరీలు, ఆర్‌పిలకు బుధవారం కచ్చపి ఆడిటోరియంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో వీధి విక్రయదారుల పై జరుగుతున్న సర్వే పారదర్శకంగా ఉండాలని అన్నారు. ఈ సర్వే రెండు మూడు రోజుల లోపల పూర్తి చేయాలని ఆదేశించారు. ఇంకా సర్వేలో నమోదు కాని వీధి విక్రయదారులను సంబంధిత వార్డ్ వెల్ఫేర్ సెక్రెటరీ, ఆర్‌పిలతో నమోదు చేయించాలని అన్నారు. సర్వే పూర్తైన వెంటనే గుర్తించబడిన వీధి విక్రయదారులకు నగరపాలక సంస్థ ఆమోదంతో గుర్తింపు కార్డులను పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు. డిప్యూటీ కమిషనర్ అమరయ్య, మెప్మా సియంయంలు కృష్ణవేణి, సోమ కుమార్, సిఒలు, స్ట్రీట్ వెండార్స్ యూనియన్ నాయకులు శివ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల ముందు వరాలు: తరువాత రైతులకు వాతలు

శ్రీకాళహస్తిరూరల్, జూలై 2 ప్రభాతవార్త



2023 ఎన్నికల ముందు అన్ని వర్గాల వారికి అరచేతిలో స్వర్గం చూపిన కూటమి నాయకులు ఎన్నికల తరువాత సాకులు చెబుతూ సూపర్ సిక్స్ అమలుకు తిలోదకాలిస్తున్నారని రైతు సంఘం నాయకులు ధ్వజమెత్తారు. బుధవారం శ్రీకాళహస్తి మండలంలోని ఒరెడ్డి పల్లి గ్రామంలో రైతు సంఘం సమావేశం ఏర్పాటు చేసారు. ఎపి రైతు సంఘ నాయకులు రామానాయుడుముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ నేడు రైతుల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు 9గంటల కరెంటు మాటలకే పరిమితమైందన్నారు. రైతులకు నేటికి గిట్టుబాటు ధరలు అందని ద్రాక్షలా మారిందన్నారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధరల్లేక దళారుల పాల్జేస్తున్నారని విమర్శించారు. వడ్డీ లేని రుణాల అందజేత కను చూపు మేరలో లేదన్నారు. సబ్సిడీ ద్వారా రైతు లకు యంత్రాలను అందించాలన్నారు. రైతులు ఎరువుల కొరతతో తల్లడిల్లుతున్నారన్నారు. ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన వరాలను అమలు చేసి ఆదుకోవాలని డిమాండ్ చేసారు. ఈ సమావేశంలో రామానాయుడుతో పాటు నియోజకవర్గ ఇన్‌చార్జి గురవయ్య, శివకుమార్, రమేష్, మల్లీశ్వరయ్య, వెంకటయ్య, చెంచయ్య రైతులు తదితరులు పాల్గొన్నారు.

## శనీశ్వర తైలాబిషేకానికి రూ.1.09లక్షలు విరాళం

శ్రీకాళహస్తి, జూలై 2 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన శనీశ్వర స్వామి ఆలయంలో తైలాభిషేకానికి విష్ణు బేరియం మేనేజింగ్ డైరెక్టర్ చెరుకూరి కృష్ణ మూర్తి దంపతులు రూ.1.09,500ల చెక్కును అందించారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి ఆది నుంచి భూరి విరాళాలు అందిస్తున్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలోని స్వామి గర్భగుడిలో భక్తుల సౌకర్యార్థం ఏసిని ఏర్పాటు చేసారు. ప్రతి ఏడాది శనీశ్వరాలయ తైలాభిషేకానికి విరాళం అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో కృష్ణమూర్తి దంపతులు బుధవారం స్వామి అమ్మవార్లను దర్సించుకున్న తరువాత ఇఒ డి.బాపిరెడ్డిని కలసి విరాళాన్ని చెక్కురూపంలో అందించారు. ఈ కార్యక్రమాల్లో డెప్యూటి ఇఒ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి, ఎఇఒ మోహన్‌లు అందించారు. వారికి ఆలయంలో ప్రత్యేక దర్శనంతో పాటు వేదపండితులతో ఆశీర్వచనాలు అందించారు.

## శ్రీ శ్వేత వారాహి అమ్మవారికి తిరుమల రెడ్డి సారె

రామచంద్రాపురం, జూలై 2 ప్రభాతవార్త:



రాయలచెరువు సమీపంలో వెలసియున్న శ్రీశక్తి పీఠంలోని శ్రీశ్వేత వారాహి అమ్మవారికి టిడిపి మండల అధ్యక్షుడు తిరుమల రెడ్డి దంపతులు బుధవారం సారె సమర్పించారు. రాయలచెరువు పేటలోని ఆయన ఇంటి వద్ద నుండి మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ భాణాసంఛాపేల్చుతూ ఊరేగింపు గా సారెను పీఠంకు తీసుకువచ్చారు. అక్కడ వేదమంత్రోచ్ఛారణల నడుమ పీఠం వ్యవస్థాపకులు కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరనంద మహాభారతి, పీఠాధీశ్వరి రమ్యానందభారతికి సారెను అందజేశారు. వీరిని పీఠాధిపతులు ఆశీర్వదించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

## ఆదుకునేందుకు నేనున్నాను: సిపాయి

శ్రీకాళహస్తిరూరల్, జూలై 2 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి నియోజకవర్గంలో గత కొన్ని సంవత్సరాలుగా రష్ఆసుపత్రి అధినేత, ఎంఎల్‌సి డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం నిరుపేదలను ఆదుకుంటున్నారు. ఎవరికవ ఏ ప్రమాదం జరిగినా నేనున్నానని ఆదుకుంటున్నారు. ఎన్నికలకు ముందు నుంచి డాక్టర్ సుబ్రమణ్యం నిరుపేదలకు 'సిపాయి భరోసా' అంటూ ఆదుకుంటున్నారు. ఆర్థిక సహాయం అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం శ్రీకాళహస్తి మండలం నారాయణపురం గ్రామంలో ఇటీవల మృతి చెందిన సొమయ్య కుటుంబాన్ని పరామర్శించారు. ఆ కుటుంబానికి నెలకు సరిపడు నిత్యావసర సరకులను డాక్టర్ అందించారు. గ్రామంలో ఆయన మాట్లాడుతూ ఎవరికి వైద్యపరంగా ఏ అవసరం వచ్చినా తనను కలిస్తే సహాయం అందిస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమాల్లో వడ్లతాంగాళ్ బాలాజి ప్రసాద్‌రెడ్డి రత్నం రెడ్డి, భరత్‌రెడ్డి, డాక్టర్ బాబురావు తదితరులు పాల్గొన్నారు

## నిత్యాన్న పథకానికి హైదరాబాదు వాసి విరాళం

శ్రీకాళహస్తి, జూలై 2 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్న దాన పథకానికి భక్తుల నుంచి విశేష స్పందన లభిస్తుంది. ఈ నేపథ్యంలో బుధవారం హైదరా బాదుకు చెందిన ఒ భక్తుడు నిత్యాన్న ప్రసాదంలో భోజనం చేసి ఎంతో సంతృప్తి చెంది రూ.55,558 లు విరాళంను అందించారు. హైదరాబాదు బీరం గూడకు చెందిన పెద్దిశెట్టి శంకర ప్రసాద్ దంపతులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. తరువాత ఎఇఒ మోహన్‌ను కలసి తాము నిత్యాన్నదాన పథకంలో భోజనం చేసాం ఎంతో బాగుందంటూ విరాళం అందించారు. వారికి ఆలయం తరపున వేదపండితులతో ఏ్రత్యేకాశీర్వచనాలు అందించారు.

## లఘు వారాహిదేవిగా శ్రీ శ్వేత వారాహి దేవి

రామచంద్రాపురం, జూలై 2 ప్రభాతవార్త:



రాయలచెరువు సమీపంలో వెలసియున్న శ్రీశక్తి పీఠంలో జరుగుతున్న శ్రీశ్వేత వారాహి నవరాత్రులలో భాగంగా 7వ రోజు బుధవారం లఘువారాహిదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి పంచామృత అభిషేకం నిర్వహించి, నూతన వస్త్రాలు ధరింపజేశారు. వివిధ రకాల సుగంధభరిత పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. పీఠానికి విచ్చేసిన భక్తులను కుర్తాళం పీఠాధిపతి శ్రీసిద్ధేశ్వరానంద మహాభారతి స్వామి, రమ్యానంద భారతి స్వాములు ఆశీర్వాలు అందజేసి తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

## అర్‌టిసి సిబ్బందికి అభినందన

శ్రీకాళహస్తి, జూలై 2 ప్రభాతవార్త
శ్రీకాళహస్తి ఎపియస్ ఆర్‌టిసి డిపోకు జూన్ మాసంలో గణనీయంమైన ఆదాయాలు వచ్చాయని ఇందుకు కష్టించిన సిబ్బందికి డిపోమేనేజర్ టి, మునిచంద్రయ్య ఓ ప్రకటనలో అభినందనలు తెలిపారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ఏ సంస్థ అయినా రాణించాలంటే అక్కడ పని చేసే సిబ్బంది మీద ఆధారపడి ఉంటుందన్నారు. శ్రీకాళహస్తి డిపోలో పని చేస్తున్న సిబ్బంది తమ సొంత ఆస్తిగా భావించి పనులు చేస్తున్నారు కాబట్టి డిపోలో ఆదాయాలు వస్తునాయని వివరించారు. జూన్ మాసంలో డిపోకు రూ.6.1కోట్లు ఆదాయం వచ్చిందని వివరించారు. ఇదికార్మికుల కృషే అన్నారు. అంతేకాకుండా ఓఆర్ 84.37శాతం వచ్చిందన్నారు. శ్రీకాళహస్తి డిపో జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. ఈ స్థాయి గుర్తింపుకు డ్రైవర్లు, కండక్టర్లు, సూపర్‌వైజర్లు, సంఘాల నాయకులు, గ్యారేజి సిబ్బంది, కార్యాలయ సిబ్బంది, సెక్యూరిటి సిబ్బందికి అభినందనలు తెలిపారు.

## అధిక ఫీజులు వసూలు చేస్తున్న కళాశాలపై చర్యలు తీసుకోండి.

### - నారాయణ గౌడ్

తిరుపతి విద్య జూలై 2 ప్రభాత వార్త



తిరుపతి పట్టణంలో నియమ నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న కార్పొరేట్, ప్రైవేట్ జూనియర్ కళాశాల అక్రమ ఫీజులను నియంత్రించి సంబంధిత కళాశాలపై చర్యలు తీసుకోవాలని ఆర్ ఐ ఓ రాజశేఖర్ రెడ్డి కి ఆంధ్రప్రదేశ్ బీసీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పర్చూరు నారాయణ గౌడ్ ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం ఇచ్చారు. గౌడ్ మాట్లాడుతూ నగరంలో కార్పొరేట్, ప్రైవేట్ జూనియర్ కళాశాలల ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించకుండా వివిధ రకాల కోర్సుల పేరుతో అమాయక తల్లిదండ్రులను మోసం చేసి లక్షల్లో ఫీజులు వసూళ్లు చేస్తూ విద్యార్థులను మానసిక వేదనకు గురిచేస్తున్న కళాశాలల గుర్తింపును రద్దుచేసి విద్యా వ్యవస్థను గాడిలో పెట్టాలని ఆర్ఐఓ ను కోరారు. అనంతరం ఆర్ ఐ ఓ మాట్లాడుతూ ఏ కళాశాల అయినా కూడా ఇంటర్మీడియట్ బోర్డు నియమ నిబంధనలకు వ్యతిరేకంగా నడుస్తున్నాయో ఆ కళాశాల పైన చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోమని తెలిపారు. పిల్లలు యొక్క తల్లిదండ్రులు ఎవరైనా కూడా కళాశాలలో ఎక్కువ ఫీజులు, బుక్స్ ఫీజులు వసూలు చేస్తున్నారని నా దృష్టికి తీసుకొని వస్తే ఖచ్చితంగా ఆ కళాశాల పైన చర్యలు తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. వినతఇచ్చిన వారిలో రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

## సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి!పెండింగ్ క్లైములను పరిష్కరించాలి!

### భవన నిర్మాణ కార్మికుల ధర్నా

శ్రీకాళహస్తి, జూలై 2 ప్రభాతవార్త




కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు అసంఘటిత భవన నార్మిణ కార్మికులకు ఇచ్చిన హామీలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం పట్టణంలోని స్వర్ణముఖి కూడలి వద్ద భవన నిర్మాణ కార్మికులు ధర్నా చేసారు. భనవ నిర్మాణ కార్మాకుల సంక్షేమ బోర్డును పునరుద్దరించాలని బోర్డులో ఉన్న సంక్షేమ బోర్డులో పెండింగ్‌లో ఉన్న 46వేల క్లైములను పరిష్కరించుటకు నిధులు మంజూరు చేయాలని వారు డిమాండ్ చేసారు. గత ప్రభుత్వం పాలనలో రూ.1200కోట్లు నిధులను తిరిగి బోర్డుకు జమ చేసి కార్మికులను ఆదుకోవాలన్నారు. భవన నిర్మాణ కార్మికుల జిల్లా అధ్యక్షుడు కత్తి రవి సారధ్యంలో జరిగిన ధర్నాలో మాట్లాడుతూ భవన నిర్మాణ మరియు ఇతర అసంఘటిత నిర్మాణ రంగంలో పని చేస్తున్న కార్మికులకు అనేక సమస్యలతో జీవితాలు గడుపుతున్నారు. పని భద్రత, ఆరోగ్యభనరదత, ఆహార భద్రత లేక దుర్భరమైన జీవితాలు గడుపుతున్నట్లు వివరించారు. కార్మికుల సంక్షేమానికి పోరాటాల తరువాత 1996లోకార్మిక సంక్షేమ చట్టం తెచ్చారన్నారు. గతంలో పరిపాలించిన జగన్మోహన్‌రెడ్డి ఆశయాలను తుంగలో తొక్కి సంక్షేమ బోర్డు రద్దు చేసి నిర్మాణ రంగ కార్మికులకు తీవ్ర అన్యాయం చేసారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది దాటినా పట్టించుకోలేదన్నారు. ఈ ధర్నాకు ఏఐటియుసి భవన నిర్మాణ ఆర్మిక సంఘ నాయకులు నారాయణ బాబు, రవికుమార్, విజయకుమార్, తొండుమల్లికార్జున్ పాల్గొన్నా రు.

## ఓబిసి జాతీయ అధ్యక్షునికి సత్కారం

శ్రీకాళహస్తి, జూలై 2 ప్రభాతవార్త



జాతీయ ఓబిసిమోర్చా అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు లక్ష్మణ్ తిరుపతి జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంగా ఆయనకు తిరుపతిజిల్లా మాజీ అధ్యక్షుడు బి.చంద్రప్ప, రాష్ట్ర కార్యదర్శి కండ్రిగ ఉమ, బి.తరుణ్‌లు కలసి స్వాగతం పలికారు. వారికి శ్రీకాళహస్తీశ్వరుని తీర్థ ప్రసాదాలను అందించారు. లక్ష్మణ్ 11 సంవత్సరాల ప్రధాని నరేంద్రమోదీ పాలనకు సంబంధించి సాధించిన ప్రగతిని విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. పుణ్యక్షేత్రం శ్రీకాళహస్తికి వచ్చే భక్తులకు సకల సదుపాయాలు కల్పించాలని సూచించారు. వారికి శ్రీకాళహస్తీశ్వరుని తీర్థ ప్రసాదాలను అందించి దుశ్శాలువతో సత్కరించారు

## కిషోర బాలికలు మంచి పౌష్టికాహారం భుజించాలి...

.రేణిగుంట జూలై 2 ప్రభాతవార్త



కిశోర బాలికలు మంచి పౌష్టిక ఆహారం భుజించాలని తేజో భారత్ ఫౌండేషన్ చైర్మన్ కోలా విశాలాక్షి అన్నారు. రేణిగుంట మండలం సి డి ఎస్ ప్రాజెక్టు పరిధిలో అంగన్వాడీ కార్యకర్తలకు సిడిపిఓ కృష్ణవేణి అధ్యక్షతన తేజోభారత్ ఫౌండేషన్ చైర్మన్ కోలా విశాలాక్షి ముఖ్య అతిథిగా బుధవారం రేణిగుంట ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనం నందు విస్తృ తస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కోలా విశాలాక్షి మాట్లాడుతూ కిషోర్ బాలికలు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా పరిశుభ్రత పాటించాలన్నారు. కిషోర్ బాలికలు తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రచు రించిన పుస్తకాన్ని బాలికలకు పంపిణీ చేశారు. నోడల్ ఆఫీసర్ వాసంతి, ఈవో సబిరన్, సూపర్వైజర్లుహేమావతి ,అనంతలక్ష్మి, అనిత వాణి, భారతి , ప్రాజెక్ట్ కార్యకర్తలు, పాల్గొన్నారు..

## సన్మానం:

శ్రీకాళహస్తి, జూలై 2 ప్రభాతవార్త



శ్రీకాళహస్తికి చెందిన బావులూరు అంకయ్యను వైకాపా రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ సంయుక్త కార్యదర్శిగా స్థానిక శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి ఆశీర్వాదంతో నియమించ బడ్డారని ఆయన్ను అభినందించారు. ఆయన్ను బుధవారం ఆంధ్ర ప్రదేశ్ నేషనల్ ఫెడరేషన్ హ్యూమన్‌రైట్స్ రాష్ట్ర అధ్యక్షుడు కామివెంకటేశ్వర్లు సారధ్యంలలో సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా వక్ఫ్‌బోర్డు మాజీ అధ్యక్షుడు షేక్ సిరాజ్, డేవిడ్, విజకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్వీయూ పచ్చదనం కోసం విరాళం.

తిరుపతి విద్య, జూలై 2 ప్రభాతవార్త
ఎస్వీయూలో పచ్చదనం పెంపొందించేందుకు తిరుపతికి చెందిన యూనియన్ బ్యాంక్ విశ్రాంత సీనియర్ మేనేజర్ ఎమ్ఎస్ దామోదరం గుప్త తన మిత్రుడి జ్ఞాపకార్థం రూ.25 వేల రూపాయల చెక్కును అందజేశారు. ఈ మేరకు బుధవారం వీసీ అప్పారవు, రిజిస్ట్రార్ భూపతినాయుడును కలిసి చెక్కును అందజేశారు. పత్తికొండకు చెందిన తన మిత్రుడు 2022 జూలై 2 వతేదీన స్వర్గస్తుడైన సివిల్ అసిస్టెంట్ సర్జన్ కె కాశీనాథ్ పిళ్ళై జ్ఞాపికార్థం చిన్న విరాళాన్ని అందించనట్లు దాత తెలిపారు.

## డిగ్రీ కాలేజీకి అతిధి అధ్యాపకులు కావలెను

పుత్తూరు, జూలై 2 ప్రభాతవార్త :
పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ అప్లికేషన్స్ బోధించడానికి అతిధి అధ్యాపకులు (గెస్ట్ ఫ్యాకల్టీ) కావాలని ప్రిన్సిపల్ డాక్టర్ బి.చంద్రమౌళి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టుకు ఎంఎస్సీ (కంప్యూటర్ సైన్స్) లేదా ఎంసిఏ లేదా కంప్యూటర్ సైన్స్‌లో ఎంటెక్ చేసిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. నెట్, సెట్ లేదా పిహెచ్‌డి కలిగిన అభ్యర్థులకు అదనపు ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 7వ తేదీ ఉదయం 10 గంటలకు సంబంధిత సర్టిఫికెట్లతో కాలేజీకి హాజరు కావాలని తెలిపారు. ఇతర వివరాలకు 9966054682 నెంబరుకు ఫోన్ చేసి వివరాలకు తెలుసుకోవచ్చున్నారు.

## అట్టహాసంగా అమరనాథరెడ్డి పుట్టిన రోజు వేడుకలు

గంగవరం, జూలై 2, ప్రభాతవార్త :
మాజీ మంత్రి, పలమనేరు ఎమ్మెల్యే అమర నాథరెడ్డి పుట్టిన రోజు వేడుకలను బుధ వారం గంగవరం మండల కేంద్రంలో టిడిపి నాయకులు అట్టహాసంగా నిర్వహిం చారు. మండలాధ్యక్షుడు సోమశేఖర్‌గౌడు, ప్రధాన కార్యదర్శి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో మాజీ మంత్రి 66వ పుట్టిన రోజు సందర్భంగా మండలంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు, కూటమి నేతలు, అభిమానుల సమక్షంలో స్థానిక పోలీస్ స్టేషన్ పక్కన ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను కట్‌జేశారు. 1000 మందికి అన్నదానం నిర్వహించారు. నాయకులు వెంకటేష్‌నాయుడు, ప్రసాద్ నాయుడు, బెజవాడ భరత్, అరుణ్‌కుమా ర్‌రెడ్డి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు రవి, శివప్రసాద్, బాలాజీ, సురేష చౌదరి, జయసింహ, సర్పంచులు చంద్రశేఖర్, రామ్మోహన్‌నాయుడు ఆనందనాయుడు, రాము, కె.చిన్నబ్బ, తదితరులు పాల్గొన్నారు.

# మాటలు ప్రభుత్వం కాదు...చేతల ప్రభుత్వం

## -సుఫరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే నాని

తిరుపతిరూరల్, జూలై 2 ప్రభాతవార్త:
చంద్రగిరి నియోజకవర్గం సర్వతోముఖాభివృద్ధి...సంక్షేమం రెండూ రెండు కళ్ళు అని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. బుధవారం ఉమ్మడి శెట్టిపల్లి గ్రామ పంచాయతీలలో తుడా చైర్మెన్ డాలర్ దివాకర్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే నాని పర్యటించారు. 'సుఫరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని మంగళంలో ప్రారంభించారు. అనంతరం తిరుమలనగర్ పంచాయతీ తుడ క్యార్టర్స్ నందు రూ.27లక్షల రుపాయాల నిధులతో నిర్మాణం చేసిన సి.సి రోడ్డును ఎమ్మెల్యే, తుడ చైర్మెన్‌లు ప్రారంభించారు. ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పనులు గురించి కరపత్రాన్ని ఇంటింటికి పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ తమది మాటలు ప్రభుత్వం



కాదని...చేతల ప్రభుత్వమని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి ఏడాది కాలంలోనే అభివృద్ధి కనిపిస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నిక ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను దశలవారీగా అమలు చేస్తామని తెలిపారు. తుడా చైర్మెన్ డాలర్ దివాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఏడాది కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో అనేక మార్పులు తీసుకొచ్చినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, యువనేత, మంత్రి లోకేష్ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సుఫరిపాలన సాగాస్తున్నారని కొనియాడారు. సూపర్ సిక్స్ పథకాలు ద్వారా ప్రతి ఇంటికి లబ్ది చేకూరుతుందని తెలిపారు.

